నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, మంగళవారం 23 ఏప్రిల్ 2024 | VIKARABAD

ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

ఇంద్రారెడ్డి సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 22 : ఇంద్రారెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం ఇంద్రారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని చేవెళ్ల పట్టణంలోని అయన విగ్రహానికి, కౌకుంట్ల లోని సమాధి వద్ద ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంద్రారెడ్డి కుమారులు కార్తిక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, రంగారెడ్డి డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ ఇంద్రారెడ్డి అందరి నుంచి దూరమై 23 ఏండ్లు కావొస్తున్నా ఇంకా ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇంద్రన్న కల, రాష్ట్రం ఏర్పడి మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో సుపరిపాలన కొనసాగిందన్నారు. ఇంద్రన్న అడుగుజాడల్లో నడుస్తూ ఆయన అశయ సాధనకు కృషి చేస్తామన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మాజీ వైస్ ఎంపీపీ ప్రసాద్, మండల అధ్యక్షుడు ప్రభాకర్, చేవెళ్ల మండల సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు శేరి శివారెడ్డి, మాజీ సర్పంచ్‌లు నరహరిరెడ్డి, మల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రభాకర్, ఎంపీటీసీ సత్యనారాయణచారి, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాపారావు, చేవెళ్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు గిరిధర్ రెడ్డి, నర్సింహులు, డైరెక్టర్లు వెంకటేశ్, మహేశ్, సాయినాథ్, గుడిమల్కాపూర్ డైరెక్టర్లు మంగలి యాదగిరి, నాయకులు మహేందర్, శేఖర్‌రెడ్డి, చింటు, శ్రీకాంత్, రాఘవేందర్‌ఎడ్డి, చందు, ఎల్లయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్

హాజరుకానున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

క్యాంపు ఆఫీస్ నుంచి భారీ ర్యాలీ : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, ఏప్రిల్ 22 : చేవెళ్ల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మంగళవారం నామినేషన్ వేయనున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. సోమవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ అధ్యక్షుడు అంతారం నరేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారన్నారు. ఉదయం 10గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి రిటర్నింగ్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీసీ నేత, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. నాయకులందరూ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ రాందాస్, కో ఆప్షన్ సభ్యులు మలాకీ రత్నం, జగదీశ్, యువజన సంఘం అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, సీనియర్ నాయకులు నవాబు ముంతాజ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజు, రజాక్, గోపాల్, సాయిబాబాగౌడ్, వెంకటేశ్, నర్సింహగౌడ్, చందు, రాముడు యాదవ్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

సీ-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రజలు సీ-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శశాంక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు సీ-విజిల్ యాప్ నుంచి వచ్చిన 85 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. జిల్లాలో ఓటర్లను ప్రలోభ పెట్టినా, భయ భ్రాంతులకు గురి చేసినా.. సమాచారం ఇవ్వవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎలక్షన్ కమిషన్ ప్రజల చేతిలో సీ-విజిల్ అనే బ్రహ్మాస్త్రం పెట్టిందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లో సీ-విజిల్ యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చన్నారు. ఎన్నికలు సజావుగా పారదర్శకంగా జరుగాలంటే ప్రజలు తమ కండ్ల ఎదుట కనిపిస్తున్న అన్యాయంపై వెంటనే సీ-విజిల్ యాప్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సీ-విజిల్ యాప్ సురక్షితమైనదని, దీనిని ఆపరేటింగ్ చేయడం సైతం చాలా సులువని పేర్కొన్నారు. ఇంగ్లిష్‌లో కానీ తెలుగులో కానీ ఫిర్యాదు చేయవచ్చని, రంగారెడ్డి జిల్లావాసులు సీ-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ధాన్యం.. దైన్యం

రంగారెడ్డి జిల్లా రైతాంగానికి ఈ ఏడాది యాసంగి కలిసి రాలేదు. అనావృష్టి పరిస్థితుల్లో నానా కష్టాల నడుమ యాసంగి పంటలను పండించిన రైతన్నలను అకాల వర్షాలు మరింత ఆగం చేశాయి. కరువు పరిస్థితుల్లో అరకొర దిగుబడులపై రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో కొద్దిపాటి ఆశలపైన వరుణ దేవుడు నీళ్లు చల్లాడు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో సుమారు 300 ఎకరాల్లో వరి, మొక్కజొన్నతోపాటు మామిడి వంటి పండ్లతోటలకు నష్టం వాటిల్లింది. ఇక కాస్తో.. కూస్తో చేతికొచ్చిన వడ్లను సైతం అమ్ముకుందామంటే నత్తనడకన సాగుతున్న కొనుగోళ్లతో ఆర్థికంగా చితికిపోతున్న జిల్లా రైతుల బతుకులు దైన్యంగా మారాయి.

-రంగారెడ్డి, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ)

- అతివృష్టి.. అనావృష్టి పరిస్థితులతో రైతన్నలు కుదేలు
- అరకొరగా చేతికొచ్చిన పంట సైతం వర్షార్పణం
- 300 ఎకరాలకు పైగా పంటలకు నష్టం.. దిగుబడులపై దిగులు..
- ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించింది 134 క్వింటాళ్లే
- జిల్లా రైతులకు కలిసి రాని యాసంగి సాగు

ఇటీవల కురిసిన అకాల వర్షం జిల్లా రైతాంగాన్ని ఆగమాగం చేసింది. ఈదురు గాలులతో కూడిన వాన రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో గత యాసంగి కంటే ఈసారి తక్కువ ఎకరాల్లోనే వరి సాగు అయ్యింది. దిగుబడులు గణనీయంగా తగ్గనుండడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు దిగులు చెందుతున్న తరుణంలో అకాల వర్షం రైతులను మరింత కుంగదీసింది. జిల్లావ్యాప్తంగా 300 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తున్నది. అందులో 217 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి వంటి పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇంకా నష్టం వివరాల లెక్కలు తీస్తున్నామని, త్వరలో ప్రభుత్వానికి నివేదించనున్నట్లు చెబుతున్నారు. ఆరుగాలం సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో వర్షానికి నేలకొరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడి కూడా మిగలకపోవడం రైతు కుటుంబాలను కంటతడి పెట్టిస్తున్నది.

నేటికీ లోటు వర్షపాతమే..

ఈ ఏడాది జూన్ నుంచి సరైన వర్షాలు జిల్లాలో కురవలేదు. మే నెల నాటికి 691.6 మి.మీ.ల వర్షపాతం కురవాల్సి ఉండగా.. ఇప్పటివరకు 667.4మి.మీ.ల వర్షపాతమే కురిసింది. ఇంకా 3.5మి.మీ.ల లోటు వర్షపాతమే నమోదైంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది యాసంగిలో గతంలో ఎన్నడూ లేని గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. మండుతున్న ఎండలతో 15 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. చెరువులు, కుంటలతో పాటు వ్యవసాయ బోర్లలోనూ నీళ్లు పాతాళానికి అడుగంటాయి. ఈ క్రమంలో ప్రస్తుత యాసంగిలో పంటల సాగు విస్తీర్ణం సైతం గణనీయంగా తగ్గింది. గతేడాది 1,23,240 ఎకరాల్లో రైతాంగం పంటలను సాగు చేయగా.. ప్రస్తుత యాసంగిలో గతంలో కంటే 20వేల ఎకరాల్లో తక్కువగా పంటల సాగు నమోదైంది. గత యాసంగిలో వరి సాగు 90,447 ఎకరాలు ఉంటే.. ప్రస్తుత యాసంగిలో 83,110 ఎకరాల్లో మాత్రమే సాగైంది. మొక్క జొన్న గత సీజన్‌లో 13,530 ఎకరాలు ఉంటే.. ఈసారి 6,150 ఎకరాలకే పరిమితమైంది. సీజన్ ఆరంభ నుంచే పంటల సాగుకు రైతన్నలకు ప్రతిబంధకాలు ఎదురయ్యాయి. కరెంటు, సాగు నీటి కొరత కారణంగా యాసంగిలో రైతుల అంచనాలు తలకిందులయ్యాయి. మొన్నటి వరకు పుట్ల కొద్దీ వడ్లు పండిన జిల్లాలో ఇప్పుడు పంట చేతికి రావడమే గగనంగా మారింది. పంటలతోపాటు కూరగాయల సాగు సైతం ప్రస్తుత సీజన్‌లో గణనీయంగా తగ్గింది. దీంతో కూరగాయలు, పండ్లు, పూల దిగుబడులు తగ్గిపోయి మార్కెట్లో ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. వరితోపాటు వివిధ రకాల సాగు తగ్గడంతో వాటి ధరల పెంపుపై ప్రభావాన్ని చూపుతున్నాయి. కొన్నాళ్లక్రితం వరకు రూ.4వేలు ఉన్న క్వింటాల్ బియ్యం ధర రూ.6వేలకు పైగానే పలుకుతున్నది. ఫలితంగా రానున్న రోజుల్లో ఆహార ధాన్యాన్ని కొనలేని పరిస్థితులు నెలకొననున్నాయి.

సాంత్వన 'కరువు'..

యాసంగిలో పంటలు చేతికందక రైతు కుటుంబాలు దైన్య పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతుండగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు సాంత్వన కరువైంది. ఎండిన పంటలకు పరిహారం చెల్లించే విషయంలో ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తున్నది. అకాల వర్షాలు రైతులను మరింత కుంగుబాటుకు గురిచేయగా.. ఓదార్పు కల్పించే చర్యలేవీ ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టలేదు. దీనికితోడు పండిన కాస్త ధాన్యాన్ని సైతం అమ్ముదామనుకుంటే.. సకాలంలో కొనే పరిస్థితి లేదు. జిల్లాలో ఆర్భాటంగా 33 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. కానీ.. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు మాత్రం ప్రారంభం కాలేదు. ఇటీవలనే మంచాల మండలం గొడుకొండ్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో 34 మంది రైతుల నుంచి కేవలం 134 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. నేడో, రేపో ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారంలో కొనుగోళ్లను ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. ఓ వైపు పంటలు చేతికందక.. మరోవైపు అరకొర పంటలకు సైతం మద్దతు ధర రాక రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

హామీల అమలుకు రైతుల పక్షాన పోరాటం

- పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 22 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమాన్ని సోమవారం మహేశ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ప్రధానంగా రైతులకు సంబంధించిన రూ.2లక్షల పంట రుణ మాఫీ, ప్రతి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్, రైతుభరోసా కింద ఎకరాకు సంవత్సరానికి రూ.15వేల పెట్టుబడి సాయం, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు అందిస్తున్న పింఛన్ రూ.2వేల నుంచి రూ.4వేలకు పెంపు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు చేయూత వంటి పథకాలను అమలు చేయలేదన్నారు. ప్రజాపాలన పేరిట దరఖాస్తుల స్వీకరణ ద్వారా కాలయాపన చేసి ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నదని నానుస్తున్నదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి లబ్ధి పొందేందుకు రూ.2లక్షల రుణమాఫీ ఆగస్టు 15వ తేదీ వరకు అమలు చేస్తామంటూ అబద్దాలు చెబుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు జరిగేంత వరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారని, కేసీఆర్ పాలనలోనే తమకు న్యాయం జరిగిందని తెలుపుతున్నారన్నారు. ప్రతి గ్రామం నుంచి పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ కొప్పుల శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్ భాస్కర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్ ఆంజనేయులు, సీనియర్ నాయకులు బీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ కే వెంకట్రాంరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ మాణిక్యం, నాయకులు పీరంపల్లి రాజు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంగు సంతోశ్, నాయకులు బీ రవికుమార్, చుక్కయ్య, ఆసిఫ్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఒక్క రోజే 11 నామినేషన్లు

రంగారెడ్డి, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి సోమవారం ఒక్క రోజే 11 నామినేషన్లు దాఖలయ్యాయి. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా తోట్ల రాఘవేందర్, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) పార్టీ తరపున అభ్యర్థిగా మహ్మద్ సలీం, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌లు సోమవారం రెండో సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. వీరితో పాటు బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రజా ఎక్తా పార్టీ అభ్యర్థిగా సానెమ్ రాజ్ గౌడ్, ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇంక్విలాబ్-ఇ-మిలాత్ పార్టీ అభ్యర్థిగా మహ్మద్ అబ్దుల్ ఖావీ అబ్బాసీ, స్వతంత్ర అభ్యర్థులుగా జి.మల్లేశం గౌడ్, మహ్మద్ అఫ్సర్ ఖుద్దూస్, ఖడ్గేకార్ శ్రీనివాస్, ఇస్లావత్ పాండు నాయక్, అమీర్ సాజిద్ ఒక్కొక్క సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. రాజేంద్రనగర్ ఆర్వో కార్యాలయంలో అభ్యర్థుల నుంచి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక నామినేషన్లను స్వీకరించారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఇప్పటి వరకు మొత్తం 23 నామినేషన్లు దాఖలు అయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 18 నామినేషన్ల స్వీకరణ పర్వం మొదలవగా..ఈ నెల 25తో స్వీకరణ గడువు ముగియనున్నది.

ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది..

- బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- అట్టహాసంగా క్యామ మల్లేశ్ నామినేషన్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 22 : గత శాసనసభ ఎన్నికలకు ముందు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా క్యామ మల్లేశ్ సోమవారం భువనగిరి కలెక్టర్ కార్యాలయంలో నామిషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి మాట్లాడుతూ క్యామ మల్లేశ్ గెలుపునకు బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పని చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయసంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులు బుగ్గరాములు, రమేశ్‌గౌడ్, రమేశ్, జంగయ్య, వెంకట్‌రెడ్డి, దామోదర్, శ్రీకాంత్, ఏర్పుల చంద్రయ్య, రవీందర్‌రెడ్డి, జక్క రాంరెడ్డి, సురేష్, ప్రభాకర్‌రెడ్డి, బలరాం, క్యామ శంకర్, సికిందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, జగన్నాథం, వెంకటేశ్, రాజిరెడ్డి, యాదగిరి, రవీందర్‌రెడ్డి, ఐలయ్య, లక్ష్మారెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యామ మల్లేశ్ నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

తనిఖీలు ముమ్మరం...

- చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచిన అధికారులు
- ఇప్పటివరకు వికారాబాద్ జిల్లాలో 2.15 కోట్ల నగదు సీజ్
- రూ.10 లక్షలు మించి పట్టుబడితే ఐటీ శాఖకు అప్పగింత
- సరైన ఆధారాలు చూపిస్తే 4 రోజుల్లో రిలీజ్..
- ఇప్పటికే రూ.79 లక్షలు తిరిగి అందజేత

వికారాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): ఎంపీ ఎన్నికల దృష్ట్యా అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం భారీగా తరలించే అవకాశమున్న నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్టుల ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. వికారాబాద్ జిల్లాకు ఆనుకొని ఉన్న కర్ణాటక సరిహద్దు వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రూ.50 వేల మించి నగదు ఉంటే స్వాధీనం చేసుకుంటున్నారు. అధిక మొత్తం డబ్బులు తరలిస్తే సరైన ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలను అధికారులకు చూపించాల్సి ఉంటుంది. సీజ్ చేసిన నగదుకు సంబంధించిన ఆధారాలను చూపిస్తే 3-4 రోజుల్లో డబ్బును రిలీజ్ చేస్తారు. లేదంటే ఎన్నికల అధికారులకు అప్పజెప్పుతున్నారు. రూ.10 లక్షలకు మించి నగదు పట్టుబడితే ఐటీ శాఖకు అందజేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.2.15 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్క నవాబుపేట మండలంలోనే రూ.1.50 కోట్ల నగదును సీజ్ చేశారు. ఇప్పటివరకు ఆధారాలు చూపించిన రూ.79 లక్షలను రిలీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

చెక్‌పోస్టులు పెట్టి.. నిఘా పెంచి..

జిల్లాలో 7 అంతర్రాష్ట్ర సరిహద్దుల చెక్‌పోస్టులు, 8 అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిఘా పెంచారు. 24 గంటలూ తనిఖీలు చేస్తూ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.8.71 లక్షల విలువైన 2909 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు 107 మందిపై కేసులు నమోదు చేశారు. మరోవైపు 2.2 కిలోల గంజాయి, రూ.24 లక్షల విలువ చేసే 338 గ్రాముల బంగారం, 5.12 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. 240 లైసెన్సెడ్ గన్లు ఉండగా, ఇప్పటికే 218 మంది డిపాజిట్ చేశారు. 262 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చేసే ఖర్చుపై అధికారులు నిఘా పెట్టారు. ప్రచారంలో ఏయే ఖర్చు పెడుతున్నారనే దానిపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నారు. చెక్‌పోస్టులతోపాటు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న వారిపై నేరుగా సామాన్య ప్రజానీకం కూడా ఫిర్యాదు చేసే విధంగా సీ-విజిల్ యాప్‌ను, 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకువచ్చింది.

సరైన ఆధారాలుంటేనే నగదు రిలీజ్...

స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించి సరైన ఆధారాలుంటే వీలైనంతా త్వరితగతిన రిలీజ్ చేస్తున్నాం. ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న నగదులో రూ.79 లక్షలను రిలీజ్ చేశాం. జిల్లా అంతటా గట్టి నిఘా పెట్టి డబ్బు, మద్యం తరలించకుండా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం. ఏ అభ్యర్థి కూడా ఎన్నికల సంఘం నిర్ణయించిన దానికి మించి ఖర్చు చేయకుండా నిఘా పెట్టడంతోపాటు ఎప్పటికప్పుడు అభ్యర్థుల ఖర్చుల వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందజేస్తున్నాం.

- సి.నారాయణరెడ్డి, వికారాబాద్ కలెక్టర్